క్లుప్తంగా

రేషన్ డీలర్లకు రూ. 5వేల గౌరవ వేతనం చెల్లించాలి

భువనగిరి : రేషన్ డీలర్లకు రూ. 5వేల గౌరవ వేతనం చెల్లించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎలగల రాజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రతి క్వింటా బియ్యానికి కమిషన్ కింద రూ. 300లు ఇవ్వాలని.. ప్రతి ఎంఎల్ఎస్ గోదాముల ద్వారా రేషన్ డీలర్లకు సరఫరా చేయబడుతున్న బియ్యం తక్కువ రావడంపై ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వే బ్రిడ్జిను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు.

డీఈఓకు సన్మానం



డీఈఓను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

భువనగిరి : జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహను శుక్రవారం ట్రస్మా నాయకులు డీఈఓ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు పగిడాల జలంధర్‌రెడ్డి, రంగరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వలిగొండ : మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా వద్ద చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల సరైన ధ్రువ పత్రాలు, హెల్మెంట్, నంబర్‌ప్లేట్లు సరిగా కనిపించని ద్విచక్రవాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలను పట్టుకుని జరిమానాలు విధించారు. తనిఖీలో ట్రాఫిక్ ఏఎస్సైలు యాదయ్య, ఇద్దయ్య, సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ విష్ణు, శంకర్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రత్యేకాధికారి దీప

చౌటుప్పల్ రూరల్: మండలంలోని చిన్నకొండూర్ గ్రామంలో దివీస్ పరిశ్రమ సహకారంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు శుక్రవారం గ్రామ ప్రత్యేకాధికారి పి.దీప శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.సురేష్, మాజీ సర్పంచ్ తీగుళ్ల పెంటయ్య, బక్క శ్రీనాథ్, దివీస్ పరిశ్రమ ప్రతినిధులు గోపి, సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్ మాధవి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో అలసత్వం వహించొద్దు

బొమ్మలరామారం : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో అలసత్వం వహించొద్దని మండల నోడల్ అధికారి జ్యోతి కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్, ఎంపీఓ మాలిని, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మోత్కూర్ : మోత్కూర్ ఎస్ఐగా దొమ్మినేటి నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్రీకాంత్ రెడ్డి హైదరాబాద్ బాలాపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

నిధులు మంజూరు చేయాలి

భువనగిరిటౌన్ : భువనగిరి తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలమైందని నూతన భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం భువనగిరికి వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నిజాం కాలం నాటి భవనం కావడంతో చిన్నపాటి వర్షం వచ్చిన తహసీల్దార్ కార్యాలయం కురుస్తుందని తెలిపారు.

'హైడ్రా'ను అమలు చేయండి

భువనగిరిటౌన్ : చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు తెలంగాణ సర్కార్ ఏర్పాటు చేసిన హైడ్రాను యాదాద్రి జిల్లాలో కూడా అమలు చేయాలని కోరుతూ భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ శుక్రవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించారు. జిల్లాలోనూ చెరువులు, నాలాలను ఆక్రమణకు గురయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా ఉండాలంటే హైడ్రాన్ని ప్రతిగ్రామానికి విస్తరించాలని కోరారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆసక్తి చూపని యువత
- ఆటస్థలాల్లో కనీస వసతులు లేకపోవడమూ ఒక కారణం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



దండు మల్కాపురంలో చెట్ల పొదలతో నిండిన క్రీడా ప్రాంగణం



ఆరెగూడెంలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

చౌటుప్పల్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. చౌటుప్పల్ మండలంలోని గ్రామాల్లో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలాలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుల పక్కనే ఉన్నాయి. వీటి నిర్వహణ చేసే వారు లేక క్రీడా ప్రాంగణాలు చెట్ల పొదలతో కనిపిస్తున్నాయి.

చౌటుప్పల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులతో రెండేళ్ల క్రితం నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు సరిపడా స్థలం లేకపోవడంతో నాటి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపిక చేశారు. పై అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో తూతూ మంత్రంగా స్థలాలను ఎంపిక చేసి క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. మండలంలో యువతకు ఆడుకోవడానికి అనుకూలంగా లేకపోవడంతో ఆ స్థలాలకు ఆదరణ లేకుండా పోయింది. బోర్డులకే క్రీడా ప్రాంగణాలు పరిమితమై అలంకారప్రాయంగా మిగిలాయి.

వసతులు లేవు.. క్రీడా సామగ్రి లేదు

మండలంలోని ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఎత్తు పల్లాలను చదును చేసి వదిలివేశారు. క్రీడా ప్రాంగణంలో కనీస వసతులు లేవు. క్రీడా సామగ్రి లేదు. క్రీడా ప్రాంగణాలు పశువుల మేతకు నిలయంగా మారాయి. సరైన నిర్వహణ లేకపోవడం, సామగ్రి ఇవ్వకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని యువత వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని క్రీడా కేంద్రాలపై దృష్టి సారించి సౌకర్యాలు కల్పించి, సామగ్రిని సమకూర్చి యువతలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీయాలని యువత కోరుతుంది.

కొన్ని గ్రామాలకు దూరంగా.. మరి కొన్ని పాఠశాలల్లో..

మండలంలోని ఆరెగూడెం, దండుమల్కాపురం, గుండ్లబావి గ్రామాల్లో గామానికి దూరంగా క్రీడా ప్రాంగణాలను నిర్మించారు.అంకిరెడ్డిగూడెం, చిన్నకొండూర్, పంతంగి, చింతలగూడెం, దామోరా ,ఎస్.లింగోటం, పిపల్‌పహడ్, మందోళ్లగూడెం, తూఫ్రాన్‌పేట, జైకెసారం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలకు నేటికీ బిల్లులు కూడా రాలేదని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు.

క్రీడా సామగ్రి ఇవ్వాలి



గతంలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ పూర్తి స్థాయిలో వసతులు కల్పించలేదు. సామగ్రి కూడా ఇవ్వలేదు. మాకు ఆటలంటే ఇష్టం. ఆట వస్తువులు లేకపోవడంతో క్రీడా ప్రాంగణాన్ని వినియోగించుకోలేకపోతున్నాం.

–పి.శ్రీకాంత్, ఎస్.లింగోటం

ఆడుకోవడానికి అనుకూలంగా లేవు



మాగ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని పాఠశాలలో నిర్మించడం వల్ల గ్రామంలోని యువత ఆడుకోవడానికి అనుకూలంగా లేదు. గ్రామంలో చాలా మంది యూత్ క్రీడల పట్ల ఆసక్తితో ఉన్నారు. క్రికెట్ ఆడుకోవడానికి బయటకు వెళ్లాల్సి వస్తుంది.

– చింతపల్లి వినయ్‌రెడ్డి, చిన్నకొండూర్

ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం



గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలను ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా నిర్మాణం చేశారు. అందుబాటులో ఉన్న స్థలం ఆధారంగా నిధులు మంజూరు చేశారు. క్రీడా సామగ్రితో పాటు ఆధునికరించాలని వస్తున్న డిమాండ్‌పై నివేదిక అందజేస్తాము.

– ఉట్కూరి అంజిరెడ్డి. ఎంపీఓ,చౌటుప్పల్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణకేంద్రంలోని శ్రీ నల్లపోషమ్మదేవి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హోమం, దిష్టికుంభం, బలిహరణం, పూర్ణాహుతి, మంత్ర పుష్పం, మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు. ఈ సందర్భంగా మెరుగు గోపాల్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్కూరి పాండు, డబ్బీకార్ సాహేశ్, చంద్రశేఖర్, రాజారమేశ్, బొడిగె లింగంగౌడ్, మాటూరి రామకృష్ణ, సెట్టి శ్రీనివాస్, వంగూరి పాండు, కీర్తి భాస్కర్, కొయ్యడ చంద్రయ్య, చెరుకు అంజయ్య, వంగూరి పెంటయ్య, చేరాల నర్సింహ, రేపాక జగన్, తండ నాగేశ్, ప్రభాకర్, జంగారెడ్డి, రమేశ్, కిషన్, నర్సింహ, శ్రీనివాస్, వెంకటేశ్, బిజిలి కుమార్, ఓంప్రకాశ్, పాండు, కుక్క కుమార్ పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పరిశీలన



కాల్వను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

భువనగిరి రూరల్ : మండలంలోని అనాజిపురం చెరువు, బునాదిగాని కాల్వలను శుక్రవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాల్వ పనుల నిర్వహణను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పొత్తంశెట్టి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కష్టారెడ్డి, పాశం శివానంద్, పచ్చిమట్ల శివరాజ్ గౌడ్, మట్ట శంకర్ బాబు, కానుకుంట్ల కొండల్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో వైద్య శిబిరం

గుండాల : ఇటీవల డెంగ్యూ జ్వరంతో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మోడల్ స్కూల్, కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ హైమావతి, డాక్టర్ యూనూస్, వీహెచ్‌వో వెంకటేషం, సీహెచ్ఎస్ వనజ, ల్యాబ్ టెక్నీషియన్ రేఖ, ఏఎన్ఎం స్వర్ణలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భక్తిశ్రద్ధలతో కంఠమహేశ్వర స్వామి బోనాలు



వలిగొండ : బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు



రామన్నపేట : జనంపల్లిలో..

వలిగొండ : మండల కేంద్రంలో కంఠమహేశ్వర స్వామి బోనాల పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో, డోలు వాయిద్యాలతో, శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా కంఠమహేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్లి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొండూరు అజయ్ కుమార్ గౌడ్, మారగోని మల్లయ్య, పబ్బు భాస్కర్, పబ్బు ఉపేందర్ బోస్, కొండూరు బాలరాజు, భాస్కర్ గౌడ్ ,పబ్బు స్వామి గౌడ్, మారగోని సత్యనారాయణ గౌడ్, మునుకుంట్ల ధనంజయ, బత్తిని దేవేందర్ గౌడ్, కొండూరువెంకటేశం,రాగిరు మధు, కాసుల వెంకన్న,బత్తిని సైదులు గౌడ్, పల్సం రాజు గౌడ్ , బత్తిని పాండుగౌడ్ ,మారగోని భిక్షపతి గౌడ్, బత్తిని పెద్ద నాగేష్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని జనంపల్లి గ్రామంలో శుక్రవారం కాటమయ్య బోనాల వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు. వేడుకల్లో గౌడ సంఘం పెద్దలు బైరు శంకరయ్య, నోముల పెద్దనర్సింహ, పులి భిక్షం, నోముల సైదులు, చిన్న నర్సింహ, పనసం సత్తయ్య, బైరు యాదయ్య, రాందాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరణ



ఆలేరురూరల్ : వివరాల సేకరణ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



రామన్నపేట: లక్ష్మాపురంలో రైతుల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

చౌటుప్పల్ రూరల్: పంట రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం,అల్లాపురం గ్రామాల్లో శుక్రవారం కొనసాగింది. రేషన్ కార్డు , ఆధార్ బ్యాంక్ ఖాతాలకు అనుసంధానం లేకపోవడం, వివిధ సాంకేతిక కారణాలతో రూ.2లక్షల వరకు రుణమాఫీ కాని రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం 40మంది రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. డేటా సేకరణ సమయంలో అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు రుణం పొందిన రైతుతో మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని అన్నారు. మండలంలో వచ్చే నెల 20 వరకు గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలకు కేటాయించిన తేదీల వారీగా గ్రామాల్లోకి వచ్చి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రైతులు వారి గ్రామాలకు వచ్చినప్పుడు వివరాలను ఇవ్వాలని కోరారు.

రామన్నపేట : మండలంలోని లక్ష్మాపురం, శోభనాద్రిపురం గ్రామాల్లో రుణమాఫీ కానీ రైతుల వివరాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారులు సేకరించారు. రేషన్‌కార్డు లేని కుటుంబ సభ్యులను గ్రూపింగ్ చేసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎజాజ్‌అలీ ఖాన్, విస్తరణాధికారులు వెంకన్న, శ్రీనివాస్, కిరణ్ మాజీసర్పంచ్‌లు బత్తుల క్రిష్ణగౌడ్, ఉప్పు ప్రకాష్, పి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం, దాచారం గ్రామాల్లో రుణమాఫీ కానీ రైతుల వివరాలను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు సేకరించారు. రేషన్ కార్డులు లేని పంట రుణం తీసుకున్న రైతులకు క్షేత్ర స్థాయిలో కుటుంబ ధృవీకరణ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు ముప్పిడి అశోక్, తుంగ గోపినాథ్, అంబటి వేణు పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : మండలంలోని శారాజీపేట గ్రామంలో జరుగుతున్న రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి బి.గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ రాని రైతుల ఇళ్లకు వెళ్లి సభ్యుల వివరాలు తప్పులు లేకుండా సేకరించాలని ఆదేశించారు. రేషన్‌కార్డు లేని కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నంబర్లు, సెల్ఫీ ఫొటోలను రుణమాఫీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్, ఏఈఓలు నాగార్జున, శివకుమార్, కారోబార్ సోమయ్య, రైతులు దేవేందర్, ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న యువజన సంఘం నాయకులు

రాజాపేట : మండలంలోని పారుపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోత్కుపల్లి ప్రవీణ్, జూకంటి ప్రవీణ్, అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కుపల్లి నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ ఎడ్ల స్వరూప రామచంద్రారెడ్డి, శీతాల వీరయ్య, గౌర బక్కులు, చీర మహిపాల్, భూపతి మహేష్, బాలకృష్ణ, వెంకటేష్, తాళ్లపల్లి బారాజ్, చిన్న బాబురావు, భూపతి సుధాకర్, పరమేష్, శ్రీకాంత్ పలువురు యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉపాధ్యాయుడు మోటె సత్తయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గొప్పదనం మరే వృత్తికి లేదన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో చక్కగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సత్తయ్య–సుజాత దంపతులను, పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు డి.భార్గవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఉబ్బు వరమ్మవెంకటయ్య, అంతటి విజయలక్ష్మీబాలరాజు, బండమీది మల్లేష్, సైదులు, పద్మ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ బాధితులను ఆదుకోవాలని వినతి

చౌటుప్పల్ : ట్రిపుల్‌ఆర్ బాధితులకు ఆదుకోవాలని కోరుతూ పలువురు నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భూములు కోల్పోయి రోడ్డున పడుతున్న బాధితులకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేటు ప్రకారంగా పరిహారం చెల్లించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో శ్రీశైలం. జంగయ్య, వెంకటేశం, యాదయ్య, బసవయ్య, నర్సింహ, గాలయ్య, రంగయ్య, వేణు, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రాజాపేట : మండలంలోని పాముకుంట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆశ్రయ్–ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందా రమేష్, ఈఎన్‌టీ డాక్టర్లు శివరాము ప్రవీణ్, నరేష్, సిబ్బంది, సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శరత్‌చంద్ర, గ్రామాభివృద్ధి సంస్థ నాయకులు శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 1,2వార్డుల్లో మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కారుపోతుల శిరీష, మాజీ ఎంపీటీసీ కురిమిల్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



భూదాన్‌పోచంపల్లి : సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ



రామన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటరమణ

భూదాన్‌పోచంపల్లి : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. పట్టణకేంద్రంలోని ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని రామన్నపేట ప్రాజెక్ట్ సీడీపీఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం పోషణ్ అభియాన్ అధికారులతో కలిసి మండలంలోని సిరిపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. తల్లులు పిల్లల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను, వంటకు ఉపయోగిస్తున్న పదార్థాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, పోషణ అభియాన్ అధికారులు ఉమేజ్, అశోక్, అంగన్‌వాడీ టీచర్లు నవనీత, వసంత, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

భువనగిరి రూరల్ : తల్లికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన మండలంలోని బస్వాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిక్కుల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. లక్ష్మమ్మకు కొడుకులు లేకపోవడంతో కూతురు రామలీల తలకొరివి పెట్టింది.



తల కొరివి పెడుతున్న కూతురు రామలీల

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

భువనగిరి రూరల్ : స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. భువనగిరి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం బ్లాక్ జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రయోజనాలను అర్హులైన స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం వినయ్ కుమార్, ఎంపీడీఓ చిలుకూరి శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, భువనగిరి ఏడీఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు అందజేత



డ్రాయింగ్ కిట్లను అందజేస్తున్న నాయకులు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రాయింగ్ కిట్లను పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయుడు కూరెళ్ల శ్రీనివాస్‌కు డ్రాయింగ్ స్టాండ్(ఆర్కిటెక్ స్టాండ్)ను బహూకరించారు. డ్రాయింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 7వ తరగతి విద్యార్థి వెంకట్‌కు రూ.5వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దాత ల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షుడు పర్నె శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తొర్పునూరి లింగస్వామి, ప్రతినిధులు పెద్దగోని లింగస్వామి, బత్తిని గణేష్, బండారు అంజి, పర్నె కృష్ణారెడ్డి, నన్నూరి శివారెడ్డి, శేఖర్, రంజిత్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు అవగాహన

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలోని మండల సమైఖ్య కార్యాలయంలో శుక్రవారం వెటర్నరీ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు మేలు రకం గేదలు, ఆవుల పెంపకం నిర్వహణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మీన, ఏపీఓ వెంకట కిషన్‌రావు, సీసీలు, సరస్వతి, శివకుమార్, భాగ్యలక్ష్మి, సుమలత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువు పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ డి.రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్ మాట్లాడుతూ 96 ఎకరాల 11 గుంటల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువులో 8 ఎకరాల 34 గుంటల విస్తీర్ణంలో ఎఫ్.టీ.ఎల్ ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వెంట కోమటి జనార్ధన్, శ్రీనివాస్, కళ్యాణ్, శ్రీను, చిరంజీవి, శేఖరాచారి, జంపాల సాయి పలువురు నాయకులు పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డికి నివాళి

గుండాల : మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన పాల సంఘం మాజీ చైర్మన్ ఎగమాటి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమీది పాండరి, ఎం.అయిలయ్య, విద్యాసాగర్‌రెడ్డి, మొగులాల్, నగేష్, కుమార్, వేణుగోపాల్‌రెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.